# నో హెల్మెట్.. నో ఎంట్రీ..

- ఈ విధానాన్ని కఠినంగా అమలు చేస్తాం
- హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేస్తూ ప్రజలకు స్పష్టమైన సందేశం
- ఎస్సై ప్రమోద్ కుమార్ గౌడ్



2

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 3, ఏప్రిల్ 2026
పేజీలు:4

## ఆరు గ్యారంటీల హామీల అమలే లక్ష్యంగా

# ప్రభుత్వం అడుగులు



- మాటేడులో గ్రామ సభ
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక..
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల యాక్షన్ ప్లాన్..

**మాటేడు, తొర్రూర్ రూరల్ (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 2:**

తొర్రూరు మండలం, మాటేడు గ్రామంలో... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ నాగరబోయిన సునీల్ యాదవ్ అధ్యక్షాతలో.. స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో..గ్రామ పంచాయతీ సెక్రటరీ గుంటుక నాగేష్ సభ నడిపించారు. గ్రామ సభలో.. ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతం ఆల పించారు. తర్వాత రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు చదివి వినిపించారు. అనంతరం.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో ప్రజాలను భాగస్వామ్యం చేయడం, ప్రజల అభిప్రాయాలను తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడం తదితర విషయాల గురించి స్పెషల్ మిగతా 2లో..





## రాయపర్తిలో అట్టహాసంగా

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

- ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన..
- సమస్యల పరిష్కారమే లక్ష్యం సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి

**రాయపర్తి, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/మచ్చ శ్రావణ్)-ఏప్రిల్ 2:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ లో భాగంగా, గురువారం రాయపర్తి మండల కేంద్రం లోని రైతు వేదికలో గ్రామ సభను ఘనంగా నిర్వహించా రు. స్థానిక సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్ర తినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఉత్తేజభరితంగా ప్రారంభం..**

సభను 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతంతో అధికారికంగా ప్రారంభించారు. అనంతరం మండల తహసీల్దార్ శ్రీనివాస్, డీసీఎస్ఓ సంధ్యారాణి ముఖ్య మంత్రి సందేశాన్ని ప్రజలకు మిగతా 2లో..







## నో హెల్మెట్.. నో ఎంట్రీ..

**పెద్దవంగర, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-ఏప్రిల్ 2:**

మండలంలోని పోచారం గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "నో హెల్మెట్ – నో ఎంట్రీ" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా, గ్రామంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి




చేస్తూ ప్రజలకు స్పష్టమైన సందేశం అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించేందుకు హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే గ్రామంలోకి ప్రవేశం ఉండదని హెచ్చరించారు. "ప్రతి వ్యక్తి తన ప్రాణ భద్రతకు తానే బాధ్యత వహించాలి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చు" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మూడు ప్రధాన లక్ష్యాలతో కొనసాగిస్తున్నామని ఆయన వివరించారు. గ్రామాన్ని గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాల నుంచి పూర్తిగా విముక్తి చేయడం, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేయడం, అలాగే గ్రామంలో భద్రతను పెంపొందించేందుకు సీసీ కెమెరాల నిఘాను బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశ్యాలుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని 25 మందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామ భద్రతను దృష్టిలో ఉంచుకొని 8 సీసీ కెమెరాలను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇవి గ్రామంలో నేరాలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఉప సర్పంచ్ సీతారాం నాయక్, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తిలో అట్టహాసంగా 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'





(మొదటి పేజీ తరువాయి)

చదివి వినిపించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడమే ఈ 99 రోజుల ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పురోగతిని ప్రజలకు వివరించారు. ముఖ్యంగా రైతు భరోసా సాగు పెట్టుబడి సాయం, సాగు సౌకర్యాల కల్పనపై రైతులకు భరోసా కల్పించారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా పారదర్శకమైన ఎంపిక ప్రక్రియ చేపడతామని, నిర్మాణ దశల వారీగా నిధులు విడుదలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం వినియోగం, బిల్లుల రాయితీపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సంక్షేమ పథకాలు: రూ. 500 కే గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, చేయూత పింఛన్ల పెంపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామ సభలో భాగంగా ప్రజల నుంచి కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మరియు ఇతర వ్యక్తిగత సమస్యలపై పెద్ద ఎత్తున దరఖాస్తులను స్వీకరించారు.

**99 రోజుల లక్ష్యం**

ప్రజాపాలనలో అందిన ప్రతి విన్నపాన్ని ప్రాధాన్యత క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి 99 రోజుల గడువులోగా పరిష్కరించేలా కృషి చేస్తానని సర్పంచ్ స్పష్టం చేశారు తాగునీరు, మౌలిక వసతుల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ క్రిష్ణ రెడ్డి, ఉప సర్పంచ్ మచ్చ రమేష్, పంచాయతీ కార్యదర్శి పల్లె వినోద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, విద్యుత్ శాఖ ఏఈ, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు హామీలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు





(మొదటి పేజీ తరువాయి)

ఆఫీసర్ చంద్రశేఖర్ వివరించారు. అలాగే..ఇందిరమ్మ ఇళ్లు, ప్రజలకు త్రాగునీరు, రైతులకు సాగునీరు మరియు రోడ్లు , మరియు బైక్ ఉన్న వారు హెల్మెట్ ధరించడం, గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి పంచాయతీ సెక్రటరీ నాగేష్ వివరించారు. వ్యవసాయ శాఖ నుంచి గ్రామంలో రైతులకు చేస్తున్న రైతు భరోసా , రైతు బీమా , సన్న వడ్లకి క్వింటాకి 500 బోనస్ ల గురించి AEO జమున వివరించారు.

విద్యుత్ శాఖ నుంచి ఉచిత విద్యుత్ 200 యూనిట్లు, విద్యుత్ కి సంబంధించి చేయవలసిన పనుల గురించి SLI రవీంద్రచారి వివరించారు. వైద్యారోగ్య శాఖ నుంచి 14 సంవత్సరాలు నిండిన పిల్లలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ.. గవర్నమెంట్ హాస్పిటల్ లో ప్రజలు ఎన్నో రకాల వ్యాధులకు ఉచితంగా టెస్ట్ చేసుకోవడం గురించి PHC సూపర్వైజర్ కమల వివరించారు. విద్యాశాఖ నుంచి జిల్లా పరిషత్, మండల పరిషత్ స్కూలలో పిల్లలకి మంచి చదువు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ ద్వారా నాణ్యమైన ఆహారం ఇవ్వడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య, టీచర్ ప్రేమలత వివరించారు. అంగన్వాడీ సెంటర్ల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు , చిన్న పిల్లలకు అందించే పౌష్టికాహారం గురించి టీచర్ మంజుల వివరించారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు పొందే లబ్ధి, మహిళా సాధికారత తదితర విషయాల గురించి C C ఉష రాణి వివరించారు. ప్రజా అభిప్రాయాలలో భాగంగా రిటైర్డ్ టీచర్ L.నర్సింహ రెడ్డి, యువకుడు మహంకాళి.ఎల్లయ్య గ్రామంలో సర్పంచ్ నాగరబోయిన సునీల్ యాదవ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి కొనియాడారు. ఈ గ్రామసభ కార్యక్రమంలో సర్పంచ్ నాగరబోయిన సునీల్ యాదవ్, ఉప సర్పంచ్ దీకొండ సుధాకర్,స్పెషల్ ఆఫీసర్ ASO చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ నాగేష్ , వార్డ్ మెంబర్లు బొల్లం. రామయ్య , సముద్రాల. లావణ్య, గార.వెంకటరమణ, మహంకాళి. వెంకన్న, మంకాల సంపూర్ణ, జాటోత్.బాలాజీ, నలమాస.రవళి, శివరాత్రి .దేవేంద్ర, గిరిశెట్టి.వెంకన్న, కొప్పుల.విజయ్ కుమార్, ఆకుల ప్రశాంత్,AEO జమున, SLI రవీంద్ర చారి, C C ఉష రాణీ, PHC సూపర్వైజర్ కమల,ANM జ్యోతి,ZPSS టీచర్ ప్రేమలత,MPPS ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య, అంగన్వాడీ టీచర్లు మంజుల,లత,శైలజ, ముత్తమ్మ ఆశ వర్కర్లు శ్రీదేవి,నిర్మల , కారోబార్ రామిరెడ్డి, లైన్ మెన్ రాంబాబు, హెల్పర్ సుధాకర్, మహిళా సంఘాల అధ్యక్షురారులు యాకమ్మ, దుర్గమ్మ,VOA లు దర్గయ్య, హేమలత, రేషన్ డీలర్లు సముద్రాల. శ్రీనివాస్, దీకొండ. వెంకన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది యాకయ్య, అనిల్, నర్సమ్మ నాగమ్మ,లక్ష్మీ, మంగమ్మ, స్వరూప, యాకమ్మ, మయూరి మరియు గ్రామ ప్రజలు పెద్దలు, నాయకులు, మహిళలు,యువతీయువకులు తదితరులు పాల్గొని గ్రామసభ విజయవంతం చేసినారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

## మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్

**తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 2**

రాచరికాన్ని ఎదిరించి స్వేచ్ఛ కోసం గోల్కొండను ఆక్రమించి ఉద్యమించిన మహానీయుడు, ప్రజలకు స్వేచ్ఛ కోసం బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్,గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు.డివిజన్ కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వర్ధంతి వేడుకలను గౌడ సంఘాల ఆధ్వర్యంలో గురువారం విశ్రాంతి భవనం ముందు ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో చత్రపతి శివాజీ మహారాజ్ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజులు మాత్రమే మొగల్ పాలనకు వ్యతిరేకంగా విరోచితంగా పోరాటం చేసి తరిమికొట్టారని, పేద ప్రజలకు అండగా నిలిచి దోపిడి పాలనకు వ్యతిరేకంగా భారత మాత ఉక్కు సంకెళ్లను తెంచడానికి ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేశారని అన్నారు. పాపన్న గౌడ్ తెలంగాణ ప్రాంతంలోని జనగామ జిల్లా కిలాసపూర్ గ్రామంలో



సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టి చిన్నతనంలోనే పెత్తందారు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకొని రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ముద్దసాని సురేష్,తూర్పాటి రవి,పేర్ల జంపన్న,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ యూత్ జిల్లా నాయకులు రాజేష్ యాదవ్, గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్,జిఎస్పీఎస్ అధ్యక్షుడు ధీకొండ శ్రీనివాస్,కెఎస్ పిఎస్ అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కుంభం మహేష్ కుమార్ గౌడ్,రావుల శోభన్ బాబు,కెఎంపిఎస్ అధ్యక్షుడు చీకటి రమేష్ గౌడ్, కోశాధికారి జలగం రామ్మూర్తి గౌడ్, యువజన సంఘం జిల్లా కార్యదర్శి పబ్బాల రాము గౌడ్,బిఆర్ఎస్ నాయకులు జై సింగ్ నాయక్,చకి లేల మణిరాజ్, శీలం లింగన్న గౌడ్, తూర్పాటి సతీష్,గౌడ సంఘం నాయకులు నిమ్మల వెంకన్న గౌడ్, బెల్లంకొండ దేవేందర్ గౌడ్, తాళ్లపల్లి బిక్షం గౌడ్, కొయ్యడ కుమారస్వామి గౌడ్,రాజ్ కుమార్ గౌడ్, ఎల్లా గౌడ్, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలి




**తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 2**

పోటీ ప్రపంచంలో విద్యార్థినీ, విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వికాస్ పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ అన్నారు.డివిజన్ కేంద్రంలోని వికాస్ పాఠశాలలో ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా మొబైల్ ఫోన్ వద్దు – పుస్తకాలు ముద్దు అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను అలాగే సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపారు.వెయ్యికి పైగా పుస్తకాలను విద్యార్థుల ముందు ఉంచి పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ఫోన్ వదిలి పుస్తకాలు పట్టడం వల్ల ఉజ్వలమైన అయిన భవిష్యత్తుతో పాటు సోషల్ మీడియాలో వచ్చే చెడు ప్రభావాలవైపు వెళ్లకుండా ఉంటారని,దానివల్ల జ్ఞానం పెరిగే అవకాశం ఉందన్నారు. సెల్ ఫోన్ వాడటం వల్ల కంటి చూపు మందగించడం, మెదడు యొక్క ఆలోచన శక్తి తగ్గిపోవడం జరుగుతుందన్నారు. పుస్తకాలు చదవడం వల్ల నాలెడ్జిని పెంచుకొని రాబోయే పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవచ్చని తెలిపారు. పాఠశాలలో ప్రత్యేకమైన లైబ్రరీని ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కెవి రెడ్డి, శ్రీలత, ప్రిన్సిపాల్ వేణుమాధవ్, నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళికలో సమస్యల పరిష్కారానికి పెద్దపీట




**తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 2**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రణాళిక'లో భాగంగా మడిపల్లి గ్రామంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నలుగురి రాంలింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సభను ముందుగా రాష్ట్ర గేయాలాపనతో ప్రారంభించారు.అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన సందేశాన్ని చదివి వినిపించారు.ఈ సందర్భంగా సభలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ.. గత రెండున్నర ఏళ్లుగా మడిపల్లి గ్రామానికి ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రజల ముందుంచారు. అలాగే, భవిష్యత్తులో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నలుగురి రామలింగం మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు, గ్రామస్తుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు.రానున్న రోజుల్లో మడిపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని,ఇందుకు అధికారులు,గ్రామస్తులు తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ?గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న పలు మౌలిక సదుపాయాల లేమిపై సభలో ప్రధానంగా చర్చించారు. పాఠశాల, పర్యావరణం, విద్యుత్, త్రాగునీటి సమస్యల పట్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ ప్రధాన సమస్యలన్నింటినీ కొలిక్కి తెచ్చి, శాశ్వత పరిష్కార మార్గం చూపాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మధుషా ఉపేందర్ రెడ్డి గ్రామ కార్యదర్శి గడ్డం శోభ వివిధ శాఖల అధికారులు వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

**మాటేడు, తొర్రూర్ రూరల్ (నేటి ఫోకస్ న్యూస్) ఏప్రిల్ 1:**

తొర్రూరు మండలం మాటేడు గ్రామంలో మాజీ ఎంపీటీసీ దీకొండ కవిత యొక్క భర్త బిక్షపతి అమ్మ దీకొండ బుచ్చమ్మ అనారోగ్యం కారణంగా చనిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈరోజు మాటేడు గ్రామానికి విచ్చేసి బుచ్చమ్మ కి నివాళులు అర్పించారు. అనంతరం బిక్షపతి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజయ్య,గ్రామ సర్పంచ్ నాగరబోయిన సునీల్ యాదవ్, ఉప సర్పంచ్ దీకొండ సుధాకర్ మరియు దీ=ూ పార్టీ గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన విధులు పారదర్శకంగా కేటాయించాలి

## - టిపిటిఫ్ దంతాలపల్లి మండల శాఖ

**దంతాలపల్లి మండలం, మహబూబాబాద్ (నేటి ఫోకస్ న్యూస్) ఏప్రిల్ 2:**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన– 2027 కార్యక్రమంలో సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్లకు సీనియారిటీ ప్రాతిపదికన విధులు కేటాయించాలని అదేవిధంగా జనగణన విధుల కేటాయింపులో గర్భిణీ స్త్రీలు,100% వైకల్యం ఉన్న ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ దంతాలపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కి ప్రాతినిధ్యం చేయనైనది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి రవీందర్, సీనియర్ నాయకులు ు. సురేందర్ గుప్తా , వీ. రాములు, దీ. వెంకన్న, వీ.రుద్రమ రాజు, + మోతీరాం, జష్ట. మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలి

**తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 2**




సామాజిక సేవ కార్యక్రమాలకు చేయూతనందించాలని పిడిజి లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్నం రామ నరసయ్య లు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు మండలంలోని సోమారం గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్ బాక్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు లక్ష్మీనరసింహ రావు, టి వెంకటరెడ్డి, విశ్వేశ్వరరావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పశుసంపదను కాపాడుకోవాలి

## - సర్పంచ్ సోమి రమేష్

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 2

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపదకు ఎంతో ముఖ్యమైన స్థానం ఉందని, రైతులు తమ పశువులను ఆరోగ్యంగా కాపాడుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని సర్పంచ్ ధరావత్ సోమి రమేష్ పేర్కొన్నారు. గురువారం పెద్దవంగర మండలంలోని పడమటి తండాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువుల టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువులకు సమయానికి టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటే పాల ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు ఆర్థికంగా లాభం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పశు సంవర్ధక సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనంతరం ఎల్ఎస్ఎ అనిల్, ఎండీ హసన్ రైతులకు పశువుల సంరక్షణ, పోషణ, వ్యాధి నిరోధక చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు శుభ్రమైన నీరు, సమతుల ఆహారం అందించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే పశువుల నివాస ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాంతమ్మ, కారోబార్ సోమన్న, గోపాల మిత్రలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## న్యాయాధికారుల నిర్బంధం.. బెంగాల్ సర్కార్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ఏడుగురు న్యాయాధికారులను గంటల తరబడి బందీలుగా పట్టుకున్న ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం న్యాయాధికారులను భయపెట్టే ప్రయత్నమే కాదని, సుప్రీంకోర్టు అధికారానికే సవాల్ విసిరేలా ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో విచారణ జరిపించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దర్యాప్తును తామే పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది.

వివరాల్లోకి వెళితే... ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా తమ పేర్లను తొలగించారంటూ ఆగ్రహించిన కొందరు నిరసనకారులు.. మాల్దాలో ముగ్గురు మహిళలు సహా ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను బుధవారం మధ్యాహ్నం ఘెరావ్ చేశారు. దాదాపు 9 గంటల పాటు వారిని నిర్బంధించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో భారీ పోలీస్, పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగి వారిని సురక్షితంగా విడిపించాయి. అధికారులను అక్కడి నుంచి తరలిస్తుండగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. “సాయంత్రం 5 గంటలకు అధికారులను నిర్బంధిస్తే, రాత్రి 11 గంటల వరకు వారికి సహాయం అందలేదు. ఇది సాధారణ ఘటన కాదు. న్యాయాధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసి, కొనసాగుతున్న ప్రక్రియను అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా చేసిన దాడిలా కనిపిస్తోంది” అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ స్వయంగా డీజీపీ, హోం సెక్రటరీకి ఫోన్ చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన విధిని నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. అధికారులకు భద్రత కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు ఏప్రిల్ 2

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా గురువారం గ్రామసభలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థాయి అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజలకు చేరువలో పాలనను తీసుకురావడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఈ గ్రామసభల్లో ప్రణాళిక అమలు విధానం, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి ప్రాధాన్య అంశాలపై గ్రామ ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను అధికారులు నమోదు చేసి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయా లేదా అన్నదానిపై పరిశీలన చేసి, ఎవరూ నష్టపోకుండా చూడాలని అధికారులు సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అందరూ కలిసి పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కార్యక్రమం గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించే దిశగా ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు, గ్రామ ప్రత్యేక అధికారులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, గ్రామ అధికారులు, ఆంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి: హరీశ్ రావు ట్వీట్

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. మంత్రి ప్రకటనలు

ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు.

ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బిజెపి ప్రభుత్వమే అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు.

ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది వారి కుట్రకు నిదర్శనమని విమర్శించారు.

రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే ఈరోజు కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బీజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? అని నిలదీశారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధమో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణా వార్తలు

పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం వచ్చేందుకు మీకు దమ్ముందా? అని సవాల్ చేశారు. మీరు క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా? అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీ బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా? లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం వల్ల ఉపయోగంలేదని కిషన్ రెడ్డి గొంతు చించుకున్నారని ఆరోపించారు. కానీ గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధమా లేక అవివేకమా అని ప్రశ్నించారు.

నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా’ రిపోర్ట్ ప్రకారం, “2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం ఉంది. 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే” అని కుండబద్దలు కొట్టిందని అన్నారు. ఇది కిషన్ రెడ్డి కళ్లకు కనబడటం లేదా అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చెప్పింది మాత్రమే ఆయన చెవుల్లోకి వెళుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి కాదని హితవు పలికారు. ప్రభుత్వ పథకాలు

కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని మా ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడితే, మీరు దాన్ని సమర్థించకపోగా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది మాత్రం రేవంత్ రెడ్డేనని వ్యాఖ్యానించారు. 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని వినిపించకపోవడం సిగ్గుచేటని హరీశ్ రావు అన్నారు.